సాక్షి సూర్యాపేట



బాణసంచా కేంద్రంలో పేలుడు
చిట్యాలలోని ఓ ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా పేలుడు సంభవించి ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. - 8లో



లాభాల బాటలో డీసీసీబీ
జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. - 10లో



న్యూస్‌రీల్

పకడ్బందీగా కోడ్ అమలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని కలెక్టర్ ఎస్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర వస్తువులు పట్టుకొని బాధితులు ఆధారాలు గ్రీవెన్స్ కమిటీకి అందజేస్తే పరిశీలన తదుపరి 24 గంటలలోపు అందజేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 32 బృందాలు విధుల్లో ఉన్నాయని, కోడ్ అమలు నుంచి శనివారం వరకు నగదు రూ.143.85 లక్షలు, రూ.46.36 లక్షలు విలువ గల 11,389.75 లీటర్ల మద్యం, రూ.3.39 లక్షలు విలువ గల 12 వాహనాలు, బంగారం, ఇతర ఆభరణాల విలువ రూ.113.63 లక్షలు ఇతర వస్తువుల విలువ రూ.72.07 లక్షలు మొత్తం 3.79 కోట్లు సీజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

నడిగూడెం: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ జి.మధుసూదనరాజు హెచ్చరించారు. శనివారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశం ఆయన మాట్లాడారు. కూలి రేట్లు పెరిగాయని, దానికి తగినట్లుగా కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, ఎంపీఓ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌కుమార్

మద్దిరాల: ప్రస్తుత వేసవి నేపథ్యంలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని డీపీఓ సురేష్‌కుమార్ సంబంధిత అధికారులను అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించి మండల కేంద్రంలో తాగునీటి సమస్యపై ఆరా తీశారు. గ్రామంలోని నీటి ట్యాంక్, వన నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాంక్ చుట్టూ శుభ్రంగా ఉంచాలని అన్నారు. వన నర్సరీలో మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు పెట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ రాజేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి

సూర్యాపేట: ఇంటి పన్ను వెంటనే చెల్లించి 5శాతం రాయితీ పొందాలని సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని గృహ, వ్యాపార, వాణిజ్య యాజమానులకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను ఏప్రిల్ 30లోపు చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 5శాతం రాయితీ ప్రకటించిందని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంబంధిత బిల్లు కలెక్టర్లకు, కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పన్ను చెల్లించి రశీదు పొందాలని కోరారు. ఆదివారం కూడా కౌంటర్లు తెరిచి ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

సూచనలు పాటించాలి



టీకాలు వేసే ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారి

పెన్‌పహాడ్: పశువుల్లోని గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించి వైద్యుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి కుమారస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని ముణ్యానాయక్ తండాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకాలు వేసేటప్పుడు సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాక్సిన్ క్యారియర్‌లోని ఐప్యాక్స్, వ్యాక్సిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల ఆశ్యకతను వివరించారు. టీకాల పంపిణీ నమోదు రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు. టీకాల పంపిణీ కార్యక్రమం వారం రోజులే ఉందని సిబ్బంది మరింత వేగంగా పని చేయాలని ఆదేశించారు. 236 పశువులకు ఉచితంగా టీకాలు వేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకన్న, మండల ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి యర్రంశెట్టి కిరణ్‌కుమార్, సిబ్బంది స్వరూప్, గోపాల మిత్రలు సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

ధాన్యం వెల్లువ

రెండు మార్కెట్లకు ఒక్కరోజే 1,02,912 బస్తాల రాక



ధాన్యం రాశులతో కళకళలాడుతున్న సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డు

- సూర్యాపేటకు 58,886.. తిరుమలగిరికి 44,026 బస్తాల ధాన్యం
- ఈ యాసంగి సీజన్‌లో ఇదే అత్యధికం
- వరుస సెలవులతో రైతుల్లో ఆందోళన



మార్కెట్‌లో వడ్లు పోస్తున్న రైతులు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట, తిరుమలగిరిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులకు ధాన్యం పోటెత్తింది. ప్రస్తుతం జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఈ రెండు మార్కెట్లకు సెలవు ఉంది. దీంతో శనివారం ఒక్క రోజే సూర్యాపేటకు దాదాపు 58,886 బస్తాల ధాన్యం (38,277 క్వింటాలు), తిరుమలగిరికి 44,026తో రెండుచోట్లా మొత్తం 1,02,912 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. ఇంత పెద్ద మొత్తంలో మార్కెట్ యార్డులకు ధాన్యం రావడం ఈ యాసంగి సీజన్‌లో ఇదే తొలిసారి. దీనికి తోడు గురువారం మార్కెట్‌కు వచ్చి విక్రయం జరిగిన ధాన్యంలో వేలాది బస్తాలు ఎగుమతికాకపోవడంతో రెండు మార్కెట్లు ఎటుచూసినా ధాన్యం బస్తాలు, ధాన్యం రాశులతో కళకళలాడాయి.

ధాన్యంతోపాటు ఇతర ఉత్పత్తులు..

బీపీటీ (పాతవి) 95 బస్తాలు, జైశ్రీరామ్ 40,424 బస్తాలు, ఐఆర్–64 రకం 9,886 బస్తాలు, హెచ్ఎంటీలు 8,481 బస్తాల చొప్పున వచ్చాయి. వీటితో పాటు కంది 121 బస్తాలు, పెసర 347 బస్తాలు, వేరుశనగ 42 బస్తాలు, బొబ్బెర్లు 4 బస్తాలు, జొన్నలు 33 బస్తాలు మొత్తం 547 బస్తాల (344 క్వింటాలు) చొప్పున అపరాలు యార్డుకు వచ్చాయి. సుమారుగా 1,119 మంది రైతులు యార్డుకు ధాన్యాన్ని తీసుకొచ్చారు. రికార్డ్ స్థాయిలో మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు జరిగేలా పర్యవేక్షించాల్సిన పలువురు అధికారులు శనివారం ఎస్వీ కాలేజీలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి శిక్షణకు వెళ్లడంతో కొనుగోళ్లలో కొంత ఇబ్బందులు తలెత్తాయి.

వరుసగా సెలవులు ఉండడంతో..

తెలంగాణలో అతి పెద్ద మార్కెట్‌గా పేరొందిన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు జిల్లాతో పాటు ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి రైతులు ధాన్యాన్ని అమ్మకానికి తీసుకొస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో వరికోతలు ప్రారంభం కాగా.. గ్రామాల్లో ఐకేపీ సెంటర్లు ప్రారంభమైనా ఇంకా కొనకపోవడంతో కొందరు మిల్లులకు తరలిస్తున్నారు. మరికొందరు సూర్యాపేట మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. ఇదే క్రమంలో సూర్యాపేట మార్కెట్ యార్డ్‌కు వరుసగా సెలవులు వస్తుండడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇప్పటికే శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా సెలవు ఉండగా శనివారం మార్కెట్‌కు రికార్డ్ స్థాయిలో ధాన్యం వచ్చింది. అయితే ఆదివారం వారంతపు సెలవు, సోమవారం అమావాస్య సెలవు, మంగళవారం ఉగాది పర్వదినం ఇలా వరుసగా 3 రోజులపాటు మార్కెట్ యార్డ్‌కు సెలవులు వచ్చాయి. ఇక, ఈనెల 10వ తేదీన మార్కెట్ ప్రారంభం కానుండగా 11వ తేదీన తిరిగి రంజాన్ సెలవు ఉండే అవకాశం ఉంది. ఇలా వారం రోజుల్లోనే ఐదు రోజులపాటు సెలవులు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో దళారులకు వడ్లను తక్కువ ధరకు విక్రయించకుండా జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

తిరుమలగిరిలోనూ పోటెత్తిన ధాన్యం



తిరుమలగిరి మార్కెట్‌లో ధాన్యం రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు శనివారం భారీగా ధాన్యం వచ్చింది. ఈ సీజన్‌లోనే అత్యధికంగా శనివారం ఒక్క రోజే 44,026 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. గరిష్టగా క్వింటాకు రూ.2,037, కనిష్టంగా రూ.1,709 ధర పలికినట్లు పేర్కొన్నారు. అర్ధరాత్రి నుంచే చుట్టుపక్కల ప్రాంతాల రైతులు ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని తీసుకురావడంతో మార్కెట్ యార్డు నిండా రాశులే కనిపించాయి.

రైతులంటే కాంగ్రెస్‌కు చిన్నచూపు



సూర్యాపేటలో చేపట్టిన రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

- ప్రజల కోసం పనిచేయడం బీఆర్‌ఎస్ పార్టీ బాధ్యత
- సూర్యాపేట రైతు దీక్షలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం బాగా లేకున్నా మండే ఎండలను సైతం లెక్కచేయకుండా పంటలు ఎండిన రైతులను పరామర్శించేందుకు వారి దగ్గరకు వెళ్తుంటే.. ఏసీ రూముల్లో కూర్చుని మంత్రులు క్రికెట్ చూడటం రైతాంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిన్నచూపు, నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండల జగదీష్‌రెడ్డి అన్నారు. రైతులకు అండగా బీఆర్‌ఎస్ తలపెట్టిన పోరుబాటలో భాగంగా శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి చేపట్టిన రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ మొద్దు నిద్ర వదిలించేందుకే దీక్షలు చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 200 మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వెల్లడించారు. రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మంది రైతుల పొట్ట కొట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ రంగాన్ని దేశానికే తలమానికగా కేసీఆర్ తయారు చేస్తే వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేసిందని మండిపడ్డారు. రూ.రెండు లక్షల రుణమాఫీ, క్వింటా ధాన్యానికి 500 బోనస్, ఎండిన పంటలపై లెక్కలు తేల్చి ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుబంధు ఇవ్వకపోవడంతో రైతులు అప్పులు చేసి సాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంగా ఉన్నా బీఆర్‌ఎస్ ప్రజల కోసం బాధ్యతగా పనిచేస్తుందన్నారు. తెలంగాణ రైతుల చెమట.. ఢిల్లీ పెద్దల పాలు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నీళ్లిచ్చే పరిస్థితి ఉన్నా.. కావాలనే కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగాయని ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో సాగు, తాగు నీటి సమస్య మీద రివ్యూ చేసినోడే లేరన్నారు. తెలంగాణలో వసూళ్లు చేసి ఢిల్లీలో కప్పం కడుతున్నారని అన్నారు. ఇది ప్రజా సమస్యలు పట్టని బరితెగింపు ప్రభుత్వం అన్నారు. ఇటువంటి దుర్మార్గపు ప్రభుత్వంపై కాళేశ్వరం జలాల మొదటి ఫలితం అందుకున్న సూర్యాపేట ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఏ పోరాటానికైన సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, నాయకులు నిమ్మల శ్రీనివాస్, వెంకటనారాయణ, అన్నపూర్ణ, భైరు వెంకన్నగౌడ్, జీడి భిక్షం, నెమ్మాది భిక్షం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఐదేళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు 126 గజాల ఇంటి స్థలం పట్టాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్.లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ శివారు సర్వేనంబర్ 126 ప్రభుత్వ భూమిలో, నేరేడుచర్ల మున్సిపాలిటీ శివారు సర్వేనంబర్ 243, 244 ప్రభుత్వ భూమిలో గత ఐదేళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. గతంలో అనేకమార్లు అప్పటి మంత్రి జగదీష్‌రెడ్డికి, అప్పటి హుజూర్‌నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డికి విన్నవించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. గుడిసెలను తొలగించి పేదలపైన, పార్టీ నాయకులపైన కేసులు పెట్టారని తెలిపారు. ఇదే విషయమై మార్చి 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి వినతి పత్రాలు ఇవ్వగా అర్హులైన వారికి పట్టాలివ్వాలని కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారన్నారు. ఇప్పటికైనా దీనిపై కలెక్టర్ స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, సూరం రేణుక, వాజిద్, పిడమర్తి లింగయ్య, పీవైఎల్ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీన ఆదివారం వారాంతపు సెలవు కాగా సోమవారం అమావాస్య, మంగళవారం తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. రైతులు తిరిగి బుధవారం రోజున మార్కెట్‌కు ధాన్యం తీసుకురావాలని కోరారు.

ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి



మాట్లాడుతున్న సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శనివారం సూర్యాపేట పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సంయుక్తంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కోటాచలం, వైద్యాధికారులు పెండెం వెంకటరమణ, కల్యాణ చక్రవర్తి, రమ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, కోశాధికారి వీరేష్ కుమార్, సంస్థ సభ్యులు జె.శశిధర్, ఎడిండ్ల అశోక్, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు ఎత్యానారయణపిళ్లే యాదవ్, వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్‌కుమార్, వాణి, న్యాయవాదులు సుంకర రవికుమార్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అనసూయ



అనసూయకు మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు, ఎమ్మెల్యే మందుల సామేల్

- వైస్ చైర్‌పర్సన్‌గా కేశిడి సరళ ఎన్నిక



చెర్‌పర్సన్ శాగంటి అనసూయ



వైస్ చైర్‌పర్సన్ కేశిడి సరళ

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపల్ నూతన చైర్‌పర్సన్‌గా శాగంటి అనసూయ, వైస్ చైర్‌పర్సన్‌గా కేశిడి సరళ ఎన్నికయ్యారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికకు సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ ఎన్నికకు 12 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరయ్యారు. మొదటగా చైర్‌పర్సన్‌గా 8వ వార్డు కౌన్సిలర్ చాగంటి అనసూయను 3వ వార్డు కౌన్సిలర్ సీహెచ్.హన్మంతు ప్రతిపాదించగా 13వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజ్యలక్ష్మి బలపరిచారు. వైస్ చైర్‌పర్సన్‌గా 7వ వార్డు కౌన్సిలర్ సరళను 12వ వార్డు కౌన్సిలర్ వై.నరేష్ ప్రతిపాదించగా, 6వ వార్డు కౌన్సిలర్ శ్రీలత బలపరిచారు. మిగతా సభ్యులందరూ చేతులెత్తి మద్దతు తెలపడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైందని ఆర్డీఓ ప్రకటించారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

తిరుమలగిరి మున్సిపాలిటీ 'హస్త'గతం

తుంగతుర్తి నియోజకవర్గంలో 15 వార్డులతో తిరుమలగిరి నూతన మున్సిపాలిటీగా 2018 ఆగస్టు 2న ఏర్పాటైంది. 2020 జనవరిలో మున్సిపల్ ఎన్నికలు జరగగా అదేనెల 27న కొత్త పాలక వర్గం కొలువు తీరింది. మొదటిసారి జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి 11 మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు విజయం సాధించారు. మొదటి చైర్‌పర్సన్‌గా 5వ వార్డు కౌన్సిలర్ పోతరాజు రజనిరాజశేఖర్, వైస్ చైర్మన్‌గా 3వ వార్డు కౌన్సిలర్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ బీజేపీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు బత్తుల శ్రీనివాస్, సరళాయాదవరెడ్డి, గిలకత్తుల ప్రియల తారాముగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ నుంచి చాగంటి అనసూయ రాములు, పొన్నం రాజ్యలక్ష్మి, కన్నెబోయిన రేణుక, పత్తెపురం సరిత, కుదురుపాక శ్రీలత కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 11 మంది, బీఆర్‌ఎస్‌కు 3, బీజేపీకి ఒక సభ్యుడు ఉన్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై గతనెల 20న అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టి నెగ్గారు. నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక శనివారం నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు చాగంటి అనసూయ, కేశిడి సరళ ఎన్నికయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు సభ్యులు గైర్హాజయ్యారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మోత్కూరు, తిరుమలగిరి రెండు మున్సిపాలిటీలు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ వశమయ్యాయి.

వారసంతలో వసూల్ రాజాలు

- కప్పం కట్టనిదే పశువుల వాహనాలను లోపలికి వెళ్లనివ్వట్లే..
- ఒక్కో దానికి రూ.200 నుంచి రూ.500 వరకు వసూలు
- వాటాలు పుచ్చుకుంటూ పట్టించుకోని అధికారులు



కోదాడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

కోదాడ: కోదాడ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ప్రతి శని, ఆదివారాల్లో నిర్వహించే వారసంతలో వసూల్‌రాజాలో ఎక్కువయ్యారు. సంతకు వచ్చే అమాయక రైతులు, పశువుల వ్యాపారుల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. నిబంధనల పేరుతో ఒకరు, అధికారుల కోసమని హప్తా పేరుతో మరొకరు ఎడాపెడా దోచుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మాత్రం వసూల్ రాజాలు ఇచ్చే వాటాలు పుచ్చుకొని గమ్మునుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనల బూచి చూపి..

కోదాడ వారసంతలో శనివారం బక్క పశువులను, ఆదివారం వ్యవసాయానికి ఉపయోగించే ఎద్దులు, పాడి పశువులు, గొర్రెలు, మేకల క్రయ విక్రయాలు జరుపుతారు. దీని కోసం దూర ప్రాంతాలకు చెందిన రైతులు, వ్యాపారులు ట్రాలీ ఆటోలు, టాటా ఏస్ వాహనాల్లో పశువులు, గొర్రెలు, మేకలను తీసుకొస్తారు. సంతకు వచ్చే వారు అవి తమ పశువులేనని గ్రామ పంచాయితీల నుంచి రహదారి పత్రం తీసుకొని రావాల్సి ఉంటుంది. చాలామంది వీటిని తీసుకురాకపోవడంతో మార్కెట్ అధికారులు ఈ నిబంధనను బూసిగా చూపి ఒక్కో వాహనం నుంచి రూ.వందల్లో వసూలు చేస్తుంటారు. దీనికి ఎలాంటి రశీదు ఇవ్వకుండా జేబులు నింపుకుంటూ మార్కెట్ ఆదాయానికి గండం గొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

అందినకాడికి దండుకుంటూ..

కోదాడ పశువుల సంతలో కొంత కాలంగా హప్తా పేరుతో కొందరు నిబంధనలకు విరుద్ధగా వేల రూపాయలు వసూలు చేయడం, మార్కెట్ అధికారులకు, పోలీసులకు తెలిసినా పట్టించుకోకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తమ ఆవరణలో ఇతరులు వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నా మార్కెట్, సంత అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిబంధనల ప్రకారం ఈ హప్తా వసూలు చేయడానికి కూడా వేలం నిర్వహిస్తారు. వేలం పాడుకున్న వ్యక్తి నెలకు కొంత మొత్తం అధికారులకు చెల్లించి ఆ నెలలో తన ఇష్టం వచ్చినట్లు వసూలు చేసుకోవచ్చు. వసూల్‌కు తనకు లైసెన్స్ ఉన్నట్లు ఇక ఈ వ్యక్తి సంతకు వచ్చే ప్రతి వాహనం నుంచి రూ.200 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. రైతులు ఇవ్వకపోతే వాహనాన్ని కదలినీయడం లేదని, సంతలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని పలువురు రైతులు అంటున్నారు.

ఆదాయానికి గండి పడుతున్నా..

ఇదిలా ఉంటే పశువుల సంత వద్ద కోదాడ వ్యవసాయ మార్కెట్‌కు చెందిన దుకాణ సముదాయం ఉంది. 20 ఏళ్ల క్రితం 12 దుకాణాలతో కోదాడ–హుజూర్‌నగర్ రోడ్డు వైపు నిర్మించారు. చాలా ఏళ్ల క్రితమే ఈ దుకాణాల్లో రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలని కొంత మందికి లీజుకు ఇచ్చారు. కొంత కాలం తరువాత దాన్ని ఎత్తివేశారు. వాస్తవానికి ప్రతి ఐదేళ్లకు బహిరంగ వేలం నిర్వహించి ఈ దుకాణాలను కేటాయించాలి. కానీ, చాలా ఏళ్లుగా దీనిలో కొంత మంది తిష్ట వేసి దుకాణాలను సబ్ లీజ్‌కు ఇస్తూ రూ.వేలు సంపాదిస్తున్నారు. ఇక్కడ ఒక గది అద్దె రూ.10వేల నుంచి రూ.15 వేలు ఉండగా వీరు మాత్రం మార్కెట్‌కు రూ.3వేల నుంచి రూ.4 వేలు మాత్రమే చెల్లిస్తూ మార్కెట్ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించి మార్కెట్ ఆదాయాన్ని పెంచాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో వేలం పాట నిర్వహిస్తాం

కోదాడ వ్యవసాయ మార్కెట్ వద్ద ఉన్న దుకాణ సముదాయానికి బహిరంగ వేలం పాట నిర్వహించడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. వారి ఆదేశాల మేరకు త్వరలో వీటికి బహిరంగ వేలం పాట నిర్వహిస్తాం.
– అశోక్, మార్కెట్ కార్యదర్శి

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేసి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగళ్యధారణతో కల్యాణ తంతు నిర్వహించారు. ఆ తర్వాత శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలోకి దూసుకెళ్లిన కారు

- నలుగురు యువకులకు స్వల్పగాయాలు



బావిలో పడిన కారు

మునుగోడు: కారు అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లడంతో నలుగురు యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధ రాత్రి దాటక మునుగోడులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్‌నారయణ పురం మండలం పుట్టపాకకు చెందిన ఇద్దరు యువకులతో పాటు సర్వేల్‌కి చెందిన యువకుడు, చిన్నకాపర్తికి చెందిన మరో యువకుడు కలసి మునుగోడు మండలంలోని జమస్థాన్‌పల్లి గ్రామానికి చెందిన తన స్నేహితుడు పుట్టిన రోజు వేడుకలకు శుక్రవారం హాజరైయ్యారు. అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి రాత్రి 1 గంటల సమయంలో బయలుదేరారు. అయితే, అందులో చిన్నకాపర్తి గ్రామానికి చెందిన యువకుడిని ఆ గ్రామంలో దింపేందుకు మునుగోడు మీదుగా నార్కట్‌పల్లి రోడ్డు నుంచి వెళ్తుండగా మార్గ మధ్యలో కార్మికనగర్ సమీపంలోని మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి నేరుగా వెళ్లడంతో అక్కడే ఉన్న పడావు బావిలో పడిపోయింది.ప్రమాదంలో నలుగురు యువకులకు స్వల్పగాయాలయ్యాయి. బావిలో పడిపోయామని గమనించిన ఆ యువకులు తమ స్నేహితులకు ఫోన్‌చేసి అక్కడికి రప్పించుకొని తాడు సహాయంతో బయటకు వెళ్లి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

హఫీజ్‌కు ఉగాది పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న హఫీజ్

కనగల్: కనగల్ మండల కేంద్రానికి చెందిన మాజీ కో ఆప్షన్ సభ్యుడు హఫీజ్ గాన కళ, సంఘ సేవా రంగాల్లో అందించిన విశేష కృషికి శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పురస్కారం దక్కింది. శనివారం హైదరాబాద్‌లోని శ్రీ శారద కల్చరల్ లైవ్ స్టూడియో శ్రీ ముఖి కాంప్లెక్స్ హిమాయత్‌నగర్‌లో హఫీజ్ ఈ అవార్డును అందుకున్నాడు.

బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు



ధ్వంసమైన ఇంటి లోపలి భాగం



గాయపడిన నిర్వాహకుడు కోటేశ్వరరావును ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు



చిట్యాలలో బాణసంచా పేలుడు జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- చిట్యాల పట్టణంలో ఘటన

చిట్యాల: బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించటంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాలలో శనివారం చోటు చేసుకుంది. డీఎస్పీ శివరాంరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన కోటేశ్వరరావు చిట్యాల మున్సిపాలిటీలోని సంతోష్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అనుమాతులు పిల్లలు వాడే బాణసంచా (పాప్‌అప్ బాంబులు) తయారు చేస్తున్నాడు. కాగా శనివారం యాథావిధిగా బాణసంచాను తయారు చేస్తుండగా అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నిర్వాహకుడు కోటేశ్వరావు చేయి తెగిపడి తీవ్రంగా గాయపడగా పనిచేస్తున్న చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన గుడిసె శాంతికి చేతికి గాయంకాగా, మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాకు చెందిన బానోతు సైదమ్మ తలకు గాయాలయ్యాయి. కాగా మరో ఇద్దరు ఉన్నప్పటికి వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు.

బాంబ్ డిస్పోజల్ టీం పరిశీలన

ప్రమాద సంఘటన జరిగిన ఇంటిని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి పరిశీలించారు. జరిగిన ప్రమాదం వివరాలను నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, చిట్యాల ఎస్‌ఐ డి.సైదాబాబుతో పాటు ప్రమాదంలో గాయపడిన వారిని, పనిచేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాదం జరిగిన ఇంటిని బాంబు డిస్పోజల్ టీం సభ్యులు ఆఫీజ్, ఫరీద్‌ల, డాగ్ టీం సభ్యుడు సంపత్‌తో పాటు క్లూ టీం సభ్యులు బాణసంచా తయారీలో వాడిన వాడిన పదార్థాలను పరిశీలించి, శాంపిల్స్‌ను సేకరించారు.

ఇంట్లోనే బాణసంచా తయారీ..

కోటేశ్వరరావు కొంత కాలంగా చిట్యాలలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని మరో నలుగురు మహిళలతో పనిచేపించుకుంటూ బాణసంచా తయారు చేస్తున్నాడు. పేలుడులో ఉపయోగించే రెండు రకాలైన తెలపు రంగులో, గోధుమరంగులోని (పాస్పరస్‌గా భావిస్తున్నారు) రసాయన ముడి పదార్థాలను వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వాటిని అద్దెకు ఉన్న ఇంట్లోనే మిక్సీలలో వేసి పౌడర్‌గా తయారు చేస్తున్నారు. అనంతరం ఆ పేలుడు పదార్థాల పొడర్‌తో పాటుగా గులకరాళ్లను పేపర్ చుట్టి ప్యాకింగ్ చేసి పిల్లలు వాడుకునే బాణసంచా (పాప్‌అఫ్ బాంబులు)లను తయారు చేస్తున్నాడు. వీటిని స్థానికంగా గల వ్యాపార దుకాణాలతో పాటుగా ఇతర ప్రాంతాలకు రవాణా చేసి విక్రయిస్తున్నాడు. ఈ పేలుడు బాణసంచా పదార్థాల పొడర్ చేసి పేపర్‌పై ఉంచితే తాము గులకరాళ్లతో కలిపి తెల్లటి పేపర్‌లో ఉండలుగా చుట్టి తయారు చేస్తున్నట్లు ఆ బాణసంచా కేంద్రంలో జరిగిన ప్రమాదం నుంచి బయటపడిన మహిళ పోలీసులకు తెలిపింది. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

వాడపల్లి శివార్లలో గుట్టుగా జూదం

- నిత్యం చేతులు మారుతున్న రూ.లక్షలు
- దేవరకొండ మాల్, మిర్యాలగూడకు చెందిన కేటుగాళ్ల కనుసన్నల్లో దందా
- జూదరులకు కొందరు ఖాకీల అండదండలు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కృష్ణా పరీవాహక ప్రాంతంలో పెద్ద ఎత్తున పేకాట స్థావరాలు నడుస్తున్నాయని తెలుస్తోంది. నిత్యం ఆంధ్రా, తెలంగాణ నుంచి పేకాటరాయుళ్లు అక్కడకు చేరుకుని దర్జాగా పేకాట కొనసాగిస్తున్నారని, నిమిషాల వ్యవధిలోనే వేలాది రూపాయలు చేతులు మారుతూ కొందరి జేబులు నిండుతూ... మరికొందరి జేబులు ఖాళీ అవుతూ కొనసాగుతుందని సమాచారం. ఈ దందా దేవరకొండ మాల్ ప్రాంతం నుంచి వలస వచ్చిన ఒకరు, మిర్యాలగూడలోని సెల్‌షాపు నిర్వహిస్తున్న మరొకరి కనుసన్నల్లో జరుగుతుండగా దీనికి సమీప పోలీస్ స్టేషన్‌లోని కొందరు కిందిస్థాయి సిబ్బంది కూడా సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోజూ వారీ వేతనం చెల్లిస్తూ..

వాడపల్లికి ఒకవైపు మూసీ నది మరోవైపు కృష్ణానది పరీవాహక ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతం కూడా ఉండడం, వీటికితోడు ఇర్కిగూడెం రోడ్డులో పడావుబడిన పాలిష్ మిల్లులు, దామరచర్ల శివారులో శిథిలమైన ఓ రసాయన కర్మాగారం, సమీపంలోని అటవీ ప్రాంతాలను అడ్డాలుగా మారుస్తూ కొంతకాలంగా జోరుగా పేకాట దందా నడిపిస్తున్నట్లు సమాచారం. పకడ్బందీ ఏర్పాట్లతో పోలీసుల రాకను పసిగట్టేందుకు కొందరు యువకులను రోజువారీ వేతనం చెల్లిస్తూ స్థావరానికి ఇరువైపులా ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా దందా నడిపిస్తున్నట్లు ఆరోపణలు అవుతున్నాయి. గతంలో కూడా దామరచర్ల మండల కేంద్రంలోని రైస్ మిల్లుగా మారిన ఓ పాలిష్ మిల్లులో యథేచ్ఛగా దందా నడవడంతో అప్పటి పోలీసులు కట్టడి చేసిన సంఘటనలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన స్టేషన్ అధికారి కనుసన్నల్లోనే అప్పటి అధికార పార్టీకి చెందిన నాయకులు కొందరుదందాను కొనసాగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ తరువాత కొంతకాలం వారు దందాను మానివేసినప్పటికీ దేవరకొండ ప్రాంతానికి చెందిన ఒక కేటుగాడు సదరు పోలీసు అధికారితో కుమ్మక్కై గతంలో కూడా ఇక్కడ దందా నిర్వహించారని, ప్రస్తుతం అధికార పార్టీ మారినప్పటికీ, గతంలో పనిచేసిన పోలీసు అధికారి బదిలీ అయినప్పటికీ అదే పోలీసు స్టేషన్‌లో గతంలో కేటుగాడితో అంటకాగిన కొందరు సిబ్బంది కొత్తగా వచ్చిన స్టేషన్ బాస్ కదలికలను ఎప్పటికప్పుడు అందచేస్తూ పేకాట దందా రాయుడికి సహకరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవైపు ఎన్నికల కోడ్ అమలవుతున్నప్పటికీ రూ.50వేల లోపు నగదు తీసుకొచ్చే అవకాశం ఉండడం, ఒకవేళా చాలకపోయినా దామరచర్ల మండల కేంద్రంలో కమీషన్‌పై ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు తీసి ఇచ్చే అవకాశం ఉండడంతోపాటు కొందరు ఈ కమీషన్ వ్యాపారంపైనే నిత్యం వేల రూపాయలు సంపాదిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పేకాటకు బాని సలై లక్షల రూపాయలు పోగొట్టుకుని చాలా మంది జీవితాలు రోడ్డున పడుతున్నాయని, అధికారులు దృష్టి సారించి పేకాట దందాను కట్టడి చేయాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పలు ఇళ్లలో చోరీకి విఫలయత్నం



నేరేడుచర్లలోని ఓ ఇంటి వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన గుర్తు తెలియని వ్యక్తుల చిత్రాలు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్‌లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు పలు ఇళ్లలో చోరీలకు ప్రయత్నించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లలోని విద్యానగర్‌లో ఉంటున్న ఇరువంటి శ్రీపాద శర్మ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించాడు. శ్రీపాదశర్మ భార్య అరవిందసాయి మెడలో గల బంగారు పుస్తెల తాడును గుంజుకునేందుకు ప్రయత్నించగా ఆమె ఎదిరించడంతో నిందితుడు పరారయ్యాడు. శ్రీపాద శర్మ రోజు మాదిరిగానే దేవాలయానికి వెళ్లగా ఉదయం 11గంటల సమయంలో ఇంట్లో అరవింద సాయి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తనకు చెవుడు అంటూ సైగల్ చేస్తూ ఓ కాగితంపై ఏదో రాసుకొని వచ్చి చూపించే ప్రయత్నం చేశాడు. ఎవరు నువ్వు అంటూ నిలదియడంతో గేటు వద్దకు వెళ్లాడు. గేటు వద్దకు వెళ్లతూ ఒక్కసారిగా మీదకు వచ్చి బంగారు పుస్తెలతాడు దొంగలించే ప్రయత్నం చేశాడు. అక్కడే ప్లాస్టిక్ స్టూల్ ఉండటంతో ఆ స్టూల్ అందుకొని అతనిపై దాడికి దిగింది. అరవిందసాయి కేకలు వేయడంతో చుట్టు పక్కల మహిళలు అక్కడి చేరుకోవడంతో గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడు. సదరు వ్యక్తి అదే కాలనీలో నివాసం ఉంటున్న కట్టా లచ్చిరెడ్డి ఇంట్లోకి వెళ్లి దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తుండగా వెంటబడటంతో పరారయ్యాడు. ఈ సంఘటన కూడా సీసీ కెమెరాల్లో కూడా చోటు చేసుకుంది. ఈ విషయంపై తెలుసుకున్న పోలీసులు నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.

పురుగుల మందు కలిపిన నీరు తాగి ఆవులు మృతి



ఆవుల కళేబరాలు

చందంపేట: పురుగుల మందు కలిపిన నీరు తాగి పదకొండు ఆవులు మృతిచెందాయి. ఈ సంఘటన నేరెడుగొమ్ము మండలం బచ్చాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బచ్చాపురం గ్రామానికి చెందిన కెతావత్ వెంకట్రాం, మోతీలాల్, కిషన్, మోహన్, హర్యాలకు చెందిన పదకొండు ఆవులు మేతకు వెళ్లి అదే గ్రామానికి చెందిన కేతావత్ సతీష్ ఆయిల్‌ఫాం తోటలోకి వెళ్లాయి. అక్కడ డ్రమ్ములో తోటకు పిచికారీ చేయటానికి ఉంచిన క్రిమి సంహారక మందు కలిపిన నీటిని తాగి మృతి చెందినట్లు రైతులు పేర్కొన్నారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. పశువైద్యాధికారి ఆధ్వర్యంలో నాలుగు ఆవులకు పోస్టుమార్టం నిర్వహించగా, మరికొన్నింటికి ఆదివారం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వివిధ కేసుల్లో పలువురికి జరిమానా

హుజూర్‌నగర్ : వివిధ కేసుల్లో పలువురికి జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ శనివారం తీర్పు చెప్పారు. హుజూర్‌నగర్‌కు చెందిన పెద్ద వెంకయ్యకు చెందిన గేదె స్థానిక వెంకట సాయి రైస్ మిల్ వద్ద యజమాని వెంకటేశ్వర్లు ఏర్పాటు చేయించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల విద్యుత్ షాక్ కు గురై మరణించినదని ఆరోపిస్తూ 2017 జూన్‌లో పెట్టిన కేసులో నిందితుడు నేరాన్ని అంగీకరించారు. దీంతో న్యాయమూర్తి అతనికి రూ.1,500 జరిమానా విధించారు. మరొక కేసులో పట్టణానికి చెందిన గుండెల్లి శాంతమ్మ, భర్త శాంతయ్యలను పట్టణానికి చెందిన ములకలపల్లి నరసయ్య, భార్య కనకమ్మలు దుర్భాషలాడి బెదిరించిన కేసులో నిందితులు తమ నేరాన్ని అంగీకరించడంతో ఇరువురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మరో కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట మండలం బండిపాలెంకు చెందిన కొరప్రాటి రత్తయ్య మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ పులిచింతల ప్రాజెక్టు వద్ద పోలీసులకు పట్టుబడిన కేసులో నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతనికి రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మారుతీ ప్రసాద్ తీర్పు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాకే అనుమతులివ్వాలి

- స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న గ్రామస్తులు

గరిడేపల్లి : పరిశ్రమల ఏర్పాటుతో గ్రామాలకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించిన తర్వాతనే వాటి ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని గరిడేపల్లి మండలంలోని సర్వారం, లక్ష్మీపురం, అబ్బిరెడ్డిగూడెం గ్రామస్తులు అధికారులను కోరారు. మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీ పరిధిలో15 సంవత్సరాల క్రితం నెలకొల్పిన శ్రీనివాస ఎడిఫైస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఇపీఎల్) మైనింగ్ ప్రాంత విస్తరణ అనుమతులకు శనివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ శివారులోని గ్రామస్తులు, రైతులు మాట్లాడుతూ పరిశ్రమలో చేపడుతున్న బ్లాస్టింగ్, దుమ్ముతో అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పరిశ్రమ నెలకొల్పిన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఇప్పుడు మళ్లీ అనుమతులు పొడిగించేందుకు అధికారులు నిర్ణయం తీసుకునే ముందు మా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా పరిశ్రమ పక్కనే ఉన్న పొలాలను, ప్రజలకు కాలుష్యం నుంచి రక్షణ కల్పించాలని, బ్లాస్టింగ్ సమయంలో ఇండ్లు బీటలు బారకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వీటిపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాల వారికి అవకాశం ఇస్తున్నారని ఆరోపించారు. పలువురు ఎన్‌జీఓలు మాట్లాడుతూ కంకర మిల్లులు కట్టిన టాక్స్‌లు డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులు చుట్టుపక్కల గ్రామాలకు వినియోగించటం లేదని, ఆ నిధులను పరిశ్రమ పరిధిలోని గ్రామాలకు కేటాయించాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జిల్లా ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సురేష్‌బాబు మాట్లాడుతూ సమావేశంలో మొత్తం 46మంది మాట్లాడారని, కార్యక్రమాన్ని రికార్డింగ్ చేశామని వీటిని పర్యావరణ, అడువులు, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖలకు పంపుతామని తెలిపారు. హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ కవిత, హుజూర్‌నగర్, మునగాల సీఐలు చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు ఈట సైదులు, రవీందర్‌నాయక్, ముత్తయ్య, లక్ష్మినర్సయ్య, అనిల్‌రెడ్డి, నవీన్, గరిడేపల్లి ఎస్‌–2 నరేష్‌తో పాటు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రావొద్దు

- యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మాట్లాడుతున్న యాదాద్రి కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జండగే అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమై తాగునీటి సరఫరాపై సమీక్షించారు. మిషన్ భగీరథ నీళ్లతో పాటు బోర్లు, చేతి పంపుల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. అంతేకాకుండా వార్డుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, రోజువారీ అవసరాలకు అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సరఫరాలో సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి పరిష్కరించాలని పేర్కొన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న ప్రతి బోరును వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. బోర్లు, చేతిపంపులు, పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతులకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్), గ్రామ పంచాయతీ నిధులు, సంబంధిత శాకల నిధులు వినియోగించుకోవాలని కోరారు. తాగునీటి పంపిణీకి సంబంధించి ఏరోజుకారోజు నివేదిక అందజేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీపీఓ సునంద తదితరులు పాల్గొన్నారు.



రూ.6లక్షల నగదు పట్టివేత



నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

చింతపల్లి : హైదరాబాద్ –నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై మండల కేంద్రంతో పాటు పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్ చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మండల కేంద్రంలోని సాయిబాబా దేవా లయం వద్ద నసర్లపల్లికి చెందిన మల్గం వెంకటయ్య నుంచి రూ.లక్ష, మాల్ వెంకటేశ్వరనగర్ చెక్ పోస్టు వద్ద దేవరకొండ మండలం మడమడక గ్రామానికి చెందిన నారబోయిన శ్రీకాంత్ నుంచి రూ.5లక్షలు సీజ్ చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా డబ్బులు తీసుకెళ్తుండంతోనే నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు.

నార్కట్‌పల్లిలో రూ.4లక్షలు స్వాధీనం

నార్కట్‌పల్లి : ఆధారాలు లేకుండా డబ్బు తరలిస్తున్న మహిళ సంఘం సభ్యుల నుంచి రూ. 4 లక్షలను నార్కట్‌పల్లి పోలీసులు శనివారం మండల కేంద్రంలో స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న నారాయణపురం గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యులు బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసుకొని స్వగ్రామానికి ఆటోలో వెళుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు వారి నుంచి రూ.4 లక్షలు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

చిరుత కలకలం

చందంపేట : మండలంలోని నక్కల గండి ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు పశువుల కాపరులు తెలిపారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ సాయి ప్రకాష్ పేర్కొన్నారు. పశువుల కాపరులు ఈ ప్రాంతంలో ఒక్కొక్కరుగా తిరగకుండా ఒక నలుగురైదుగురు కలిసి ఉండాలని సూచించారు.

చీడ పీడలు నివారిస్తేనే.. అధిక దిగుబడులు

- హాలియా ఇన్‌చార్జ్ ఏడీఏ సందీప్‌కుమార్



సందీప్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏడీఏ, హాలియా



పెద్దవూరలో సాగవుతున్న వేరుశనగ

పెద్దవూర: ఈ ఏడాది యాసంగి సీజన్‌లో రైతులు ఆరుతడి పంటగా అధిక విస్తీర్ణంలో వేరుశనగ సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. ఉష్ణోగ్రతలలో మార్పులు వస్తుండటంతో సాగులో చీడపీడలు, పోషకలోపాలు తలెత్తున్నాయి. జాగ్రత్తలు తీసుకుంటే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని హాలియా ఇన్‌చార్జ్ ఏడీఏ ఏ.సందీప్‌కుమార్ తెలుపుతున్నారు. అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు ఎరువులు, మందులు వాడితే లాభాల బాట పట్టవచ్చునని చెబుతున్నారు.

పచ్చపురుగు బెడద..

రబీలో శనగపచ్చ పురుగు బెడద అధికంగా ఉంటుంది. మార్చి నెల వరకు ఈ పురుగుల ఉధృతి ఉంటుంది. ఆకుల వెనక రెక్కలు పాలిపోయిన తెలుపు రంగుతో నల్లని అంచు కలిగి ఉంటాయి. గుడ్డు లేదా దాని నుంచి వెలువడిన పిల్ల పురుగులు లేదా ఆకుపచ్చ రంగులో పెరిగిన పురుగులు ముదురు ఆకుపచ్చ రంగు నుంచి గోధుమ రంగులోకి మారతాయి. నల్లని తల ఉన్న చిన్న పురుగులు హరితాన్ని పువ్వు మొగ్గలు, రేకులను గీకి తింటాయి. తర్వాత మొగ్గలు, పువ్వులు కాయలను తొలిచి తిని డొల్ల చేస్తాయి. ఒకే పురుగు చాలా కాయలను నష్టపరుస్తుంది. వేరుశనగ పంట లేతగా ఉన్నప్పుడు ఇవి ఆకులను తిని నాశనం చేస్తాయి. కాయలకు గుండ్రటి రంధ్రాలు చేసి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఈ పురుగును నివారించవచ్చు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. గుడ్లు, చిన్న పురుగుల నివారణకు ఐదు శాతం వేపనూనెను పంటకు పిచికారీ చేయాలి. ఎన్‌పీవీ ద్రావణాన్ని(వైరస్ ద్రావణం) ఎకరానికి 250 ఎల్ఈ తగినంత నీటిలో కలిపి సాయంత్రం సమయంలో పిచికారీ చేయాలి.

వేరుశనగలో సూక్ష్మ పోషకాలు..

వేరుశనగ మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషక పదార్థాలు అవసరం. వీటిలో ముఖ్యమైన పోషకాలైన క్యాల్షియం, సల్ఫర్, జింక్, ఇనుము వేరుశనగ పంటకు చాలా అవసరం. ఇవి మొక్కలకు తగినంత అందనప్పుడు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

పాడి పంట

కాల్షియం..

మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే ఎంజైములను ఉత్తేజపరచడానికని వేర్ల అభివృద్ధికి బాగా తోడ్పడుతుంది. తాలు కాయలు ఏర్పడకుండా గింజలు లావుగా ఉండి కాయ నాణ్యత పెరిగేందుకు దోహదం చేస్తుంది. వేరు చివరి భాగం నశించి పెరుగుదల ఆగిపోతుంది. ఆకుల్లో పచ్చదనం లోపిస్తుంది. ఆకుల కాండం విరుగుతుంది. కంచు రంగుకు మారి చిగుర్లు వంకరలు తిరుగుతాయి. వేర్ల అభివృద్ధి దెబ్బతిని బుడిపెల సంఖ్య తగ్గుతుంది. కాల్షియం లోప నివారణకు ఎకరాకు 200 కిలోల జిప్సమ్‌ను తొలి పూత దశలో అంటే విత్తిన 40 రోజులకు మొక్క మొదళ్ల దగ్గరికి ఎగదోయాలి. జిప్సం వేసిన తరువాత నీరు పెట్టాలి.

గంధకం..

గంధకం నూనె శాతం పెరగడానికి కాయలు మంచి రంగును కలిగి ఉండేందుకు కాయ గింజ బరువు పెరగడానికి దోహదపడుతుంది. నేల నుంచి నత్రజని, భాస్వరం , పొటాష్ ఎరువులను ఎక్కువ పరిమాణంలో మొక్క తీసుకోవడానికి గంధకం దోహదం చేస్తుంది. ఊడల నుంచి కాయలు తెగిపోకుండా కాపాడుతుంది. వేర్లలో రైజోబియం బుడిపెలు ఏర్పడడానికి సహకరిస్తుంది. గంధకం లోపిస్తే కొత్త ఆకులలో లోప లక్షణాలు కనిపిస్తాయి. ఆకుల ఈనెలు పసుపు రంగుకు, లేత ఆకులు పసుపు పచ్చగా మారతాయి. ముదురు ఆకులు మార్పు లేకుండా ఆకుపచ్చగా ఉంటాయి. వీని నివారణకు అమ్మోనియం సల్ఫేట్, సూపర్ ఫాస్ఫేట్, పొటాషియం సల్ఫేట్ వంటి ఎరువులు వాడాలి. గింజల్లో నూనె శాతం పెరగడానికి విత్తిన 40 రోజులకు జిప్సం వాడాలి.

ఇనుము..

ఈ పోషకం లోపించినప్పుడు ఆకులు పసుపు పచ్చగా మారుతాయి. తర్వాత ఆకు మొత్తం పసుపు రంగుకు మారుతుంది. లేత ఆకులు సన్నగా, నిటారుగా పసుపు రంగుకు మారి పసుపు రంగు కోల్పోయి, తెలుపు రంగుకు మారతాయి. ముదురు ఆకులు ఎండి రాలిపోతాయి. ఇనుము లోపం వలన కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. పంట ఎదుగుదల ఆగిపోయి దిగుబడి 30–40 శాతం తగ్గుతుంది. వీని నివారణకు ఐదు గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ ఒక గ్రాము సిట్రిక్ ఆమ్లం కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ద్రావణాన్ని ఎప్పటికప్పుడు కలుపుకుంటూ పిచికారీ చేయాల్సి ఉంటుంది.

ఆకుపచ్చ తెగులు..

పంట వేసిన 30 రోజుల నుంచి ఈ తెగులు కనిపిస్తుంది. గుండ్రంగా ఉండి ఆకు పైభాగాన ముదురు గోధుమ రంగు కలిగి ఉంటాయి. తెగులు కన్పించిన వెంటనే ఎకరాకు 400 గ్రాముల మాంకోజెబ్ లేదా హెక్సాకొనాజోల్ 400 మిల్లీలీటర్లు లేదా కార్బన్‌డిజమ్ 200 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.